

దేవరకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

మిర్యాలగూడ/దేవరకొండ, అక్టోబర్ 19 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను, దేవరకొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతకు గదులు, భద్రతా చర్యలపై అధికారులతో మాట్లాడారు. రిసెప్షన్ కేంద్రం, వాహనాల పార్కింగ్, భోజన, బారికేడ్ల విషయమై అధికారులకు సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో ఎన్నిక ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్న దృష్ట్యా విషయాన్ని ఆయా విద్యా సంస్థల యాజమాన్యానికి తెలిపి, ఆ రోజుల్లో పాఠశాలకు సెలవులు ఇచ్చేలా చూడాలన్నారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీస్‌శాఖ పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భవనానికి, స్ట్రాంగ్‌రూంకు రంగులు వేయాలని, పరిశుభ్రం చేయడంతో పాటు వాహనాల పార్కింగ్, రిసెప్షన్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం, నకిరేకల్ పాత మార్కెట్ భవనంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సువిధ, సీ-విజిల్, సహాయ వ్యయ పరిశీలన, అకౌంటింగ్ టీమ్, వీవీటీ టీమ్‌ల ఏర్పాట్లను పరిశీలించి, నామినేషన్ దాఖలు చేసేటప్పుడు పాటించాల్సిన నిబంధనలపై సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్, ఆర్డీఓలు చెన్నయ్య, శ్రీరాములు, డీఎస్పీలు వెంకటగిరి, గిరిబాబు, మున్సిపల్ కమిషనర్లు పూర్ణచందర్ రావు, వెంకటయ్య, తాసీల్దార్లు హరిబాబు, సంతోష్‌కిరణ్, పీఆర్‌ఈఈ మాధవి ఉన్నారు.

**నకిరేకల్‌లో..**

నకిరేకల్ : జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం కోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్‌నాయక్, సీఐలు రాజశేఖర్, రాఘవరావు, ఎస్‌ఐ సుధీర్ కుమార్, పీఆర్‌ఏఈ సంపత్ పాల్గొన్నారు.

# దేవరకొండలో బీజేపీకి షాక్

- మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నీల రవికుమార్
- 300 మంది బీజేపీ కార్యకర్తలు

దేవరకొండ, అక్టోబర్ 19 : దేవరకొండ నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నాయకుడు నీల రవికుమార్‌తో పాటు 300 మంది కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కేటీఆర్ దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్‌తో కలిసి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నాయన్నారు. దాంతో పాటు పార్టీ కార్యకర్తలకు కూడా బీమా అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకుడు నీల రవికుమార్ మాట్లాడుతూ బీజేపీలో ఉండి ప్రజలకు న్యాయం చేయలేమనే బీఆర్‌ఎస్‌లో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు కేతావత్ బిల్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, బొడ్డు గోపాల్, బొడ్డుపల్లి కృష్ణ, పొట్ట మధు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్, చిత్రంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకుడు బిల్యానాయక్, నీల రవికుమార్

## బీఆర్‌ఎస్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

- పార్టీ గ్రామస్థాయి సమావేశాల్లో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబర్ 19 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఘాట్‌నెమలిపురం, భీమనపల్లి, మాదాపురం, ఘనిపల్లి ఘనపురం, పోల్కంపల్లి, గుడిపల్లి, కేశంనేనిపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వల్లపు రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31న దేవరకొండలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రేటినేని ముత్యంరావు, మునగాల అంజిరెడ్డి, తోటకూరి పరమేష్, అర్వపల్లి నర్సింహ, తేరా మణిపాల్‌రెడ్డి, నరేందర్, కర్ణయ్య పాల్గొన్నారు.



పీఏపల్లి : ఘాట్‌నెమలిపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి



మాల్: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

**సమన్వయంతో కృషిచేయాలి**

మాల్ : దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజార్టీలో గెలుపొందేదుకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం చింతపల్లి మండలంలోని కురుంపల్లి, కిష్టరాయినిపల్లి, శాయిరెడ్డి గూడెం, పీకే మల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు ఉజ్జిని విద్యాసాగర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపిడి కిష్టారెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు అండెకారు అశోక్, విజయమూరి రవి, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు ఈరేటి మల్లేశ్‌యాదవ్, శ్రీశైలం, వెంకటయ్య, కృష్ణయ్య, రవీందర్‌గౌడ్, ఖాలెద్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

## వనదుర్గ అలంకరణలో దుర్గామాత

దేవరకొండ, అక్టోబర్ 19 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గామాత వనదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, 108 మంది చిన్నారులతో సరస్వతీ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసా వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, గుద్దేటి జంగయ్య, పానుగంటి మల్లయ్య, గార్లపాటి దామోదర్, మల్లయ్య, సుకన్య, కర్నాటి పురుశోత్తం, పుల్లయ్య, గోవిందు శ్రీను, శీలం వెంకన్న, సోమ నరేందర్, శ్రీదేవి పాల్గొన్నారు.




దేవరకొండ : వనదుర్గగా అమ్మవారు

**అడవిదేవులపల్లిలో ధనలక్ష్మిగా..**

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వెల్లటూరి రామ్మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**రెడ్డికాలనీలో..**

మిర్యాలగూడటౌన్ : పట్టణంలోని రెడ్డికాలనీలో బాలాత్రిపురసుందరీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు కాళికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ కళాకారులతో రాత్రి అమ్మవారి వైభవాన్ని తెలిపేలా నాటకప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హాలియా, అక్టోబర్ 19 : అనుముల మండలం చింతగూడెం స్టేజీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి రవీందర్‌రెడ్డి(28) మృతి చెందాడు. చింతగూడెం గ్రామానికి చెందిన చింతరెడ్డి రవీందర్‌రెడ్డి, ముత్యాల కొండల్ గురువారం హాలియాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి బైక్‌పై వెళ్లారు. అనంతరం ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దాంతో రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా కొండల్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108లో నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభనబాబు తెలిపారు. రవీందర్‌రెడ్డిది నిరుపేద కుటుంబం. అతడి తండ్రి గతంలోనే మృతి చెందాడు. గ్రామంలో పంక్చర్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అతను కూడా మృతి చెందడంతో కుటుంబం జీవనాధారం కోల్పోయింది.

## పంట నష్టపోయిన రైతును ఆదుకుంటాం

- ఎమ్మెల్యే సైదిరెడ్డి భరోసా

చింతలపాలెం, అక్టోబర్ 19 : మండలంలోని పాత వెల్లటూరు గ్రామానికి చెందిన గడ్డం వీరయ్య మిర్చి పొలంలో కొన్ని రోజుల క్రితం లిఫ్ట్ పైపు పగిలి పొలంలోని మట్టి కొట్టుకుపోయింది. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆదేశాల మేరకు లిఫ్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం రైతు పొలానికి వెళ్లి లిఫ్ట్ పైపు పగిలిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మళ్లీ ఇలా జరుగకుండా చర్యలు తీసుకుంటామని రైతుకు హామీ ఇచ్చారు. నష్ట పోయిన పంటకు పరిహారం ఇప్పించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పరిశీలించిన వారిలో లిఫ్టు చైర్మన్ ఎర్రం లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంకోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

## ఎమ్మెల్యే సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- బీఆర్‌ఎస్ నాయకుడు గణేశ్

గరిడేపల్లి, అక్టోబర్ 19 : వచ్చే ఎన్నికల్లో నిరంతరం ప్రజా సేవ కోసం తపించే ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్ట గణేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పలువురు పార్టీ అనుబంధ భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకుడు పిట్ట నర్సయ్య, పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.